ప్రధాన చౌరస్తాల్లో చీకట్లు

- ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు


సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ ఎదుట డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన వాహనం(ఫైల్)

నిజామాబాద్ అర్బన్: నగరంలో వాహనాల రాకపోకలు పెరిగాయి. దీనికి అనుగుణంగా అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రద్దీగా ఉండే చౌరస్తాల్లో లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి పూట వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంఠేశ్వర్ ప్రధాన చౌరస్తాలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రధాన వాహనాలన్నీ కూడా కంఠేశ్వర్ బైపాస్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తున్నాయి. అంతేగాక నూతన కలెక్టరేట్ ఏర్పాటుతో బోధన్ రోడ్డు వైపు రద్దీ కూడా పెరిగింది. కానీ ఇక్కడ సౌకర్యాల ఏర్పాటు మాత్రం లేదు. కొన్నేళ్లుగా చౌరస్తాను అభివృద్ధి చేసినా.. విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయలేదు. రాత్రి అయితే ఇక్కడ చౌరస్తా మొత్తం చీకటిమయంగా మారుతోంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వారంలో కనీసం మూడు నుంచి నాలుగు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముబారక్‌నగర్‌లోని సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ లేదు. ఇటీవల డివైడర్ నిర్మాణం చేపట్టారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకటిమయంగా మారింది. ముఖ్యంగా సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ ఎదుట డివైడర్ నిర్మాణం అక్కడే నిలిచిపోయింది. దీంతో చీకట్లో డివైడర్ కనబడక మూలమలుపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు తరచూ ఢీకొంటున్నాయి. ఇటీవల బొలెరో వాహనం వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. గతంలో ఆటో ఇదే విధంగా బోల్తా పడింది. అధికారులు స్పందించి లైటింగ్ ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

విద్యుత్ దీపాలు అమర్చాలి



ముబారక్‌నగర్ నుంచి లక్ష్మిప్రియ నగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జైత్రామ్ రాథోడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందాలి


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: దేశంలోని అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని వర్ని చౌరస్తాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. 2047 నాటికి భారతదేశం వికసితం కావాలంటే మనమందరం భాగస్వాములం కావాలన్నారు. పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల సమాచారాన్ని ప్రజలకు వివరంగా చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచారరథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ యు నాగశ్రీనివాసరావు, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ శైలి బెల్లాల్, ఎస్‌బీఐ మేనేజర్ వెంకట భార్గవ నాయుడు, కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ, రషీద్, పోచయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మేరా యువ భారత్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి



నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మేరా యువ భారత్ పోర్టల్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ బెల్లాల్ శైలి సూచించారు. గురువారం స్థానిక ద్వారకనగర్ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ శారదాదేవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ మేరా యువ భారత్ పోర్టల్‌లో 15నుంచి 29 ఏళ్లలోపు యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇది యువత నైపుణ్యాలను పెంపొందించుకోడానికి సహకరిస్తుందన్నారు. సమితి అధ్యక్షుడు సాయిప్రసాద్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక భజనలు, సందేశం, కీర్తనలు నిర్వహించారు. సమితి సభ్యులు కిశోర్ యాదవ్, ధన్‌రాజ్, వసంత్ పాటిల్, నర్సయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేపట్టినట్లు రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీస్ పేర్కొన్నారు. గురువారం కోటగల్లిలోని ఎన్.ఆర్.భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రం కోసం ఎంతో మంది యువత ప్రాణాలకు తెగించి పోరాడాన్నారు. ఆ సమయంలో పెట్టిన కేసులు ఇప్పటివరకు ఉండటం బాధాకరమన్నారు. వెంటనే ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. నవీన్‌కుమార్, సాయిబాబా, బట్టు రవి, ఉప్పలపల్లి గంగాధర్, మహేష్, మనోజ్ రమేష్ పాల్గొన్నారు.

తొలిమెట్టును విజయవంతం చేయండి



ఇందల్వాయి: తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గన్నారం ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఎఫ్ఎల్ఎన్ ఎంఎన్‌వో శ్రీధర్ సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో పేర్కొన్నారు.

నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు



ఖలీల్‌వాడి: సంఘ స్థలంలో నిర్మాణ పనులు చేపడితే అడ్డుకుంటున్నారంటూ మాల సంఘం సభ్యులు సీపీ కల్మేశ్వర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న మాల సంఘానికి చెందిన 35 గజాల స్థలంలో షట్టర్ నిర్మాణ పనులు చేపడితే సంఘ సభ్యుడైన నరేందర్ అడ్డుకుంటున్నాడని సభ్యులు ఆరోపించారు. అంతేకాకుండా సంఘ సభ్యులపై ఆర్మూర్ సీఐ, సీపీకి తప్పుడు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. నిర్మాణ పనులు అడ్డుకుంటున్న నరేందర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీని సభ్యులు కోరారు.

బస్టాండ్‌లో కళాజాత



బోధన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని బస్టాండ్‌లో గురువారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న మాట్లాడుతూ.. ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను ప్రజలు గమనించాలని సూచించారు. ప్రజలు భయపడకుండా టెస్టులు చేసుకోవాలని కోరారు. కళాజాత కార్యక్రమంలో స్నేహ సొసైటీ సభ్యులు సావిత్రి, సంపూర్ణ, స్రవంతి, సంతోష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి


నివాళులర్పిస్తున్న మేయర్ నీతూకిరణ్, అధికారులు

నిజామాబాద్‌నాగారం: లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం స్నేహ సొసైటీలో ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ దండు నీతూకిరణ్ స్నేహ సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెయిలీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ, మెప్మా పీడీ రాజేందర్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రభుత్వ అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇలాయిజ్ ఉద్దీన్, ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.


అంధ ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్

సిరికొండ: మండలంలోని గోప్యనాయక్ తండా సర్పంచ్ శంకర్‌లాల్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజ్‌నాయక్, మోజీరాంనాయక్, బాలకిషన్ నాయక్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ: సిరికొండతో పాటు తాటిపల్లి, చీమన్‌పల్లి, పందిమడుగు గ్రామాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శుక్రవారం పర్యటిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి తెలిపారు. మండల కేంద్రంలో మధ్యాహ్నం నిర్వహించే ప్రజాపాలన గ్రామ సభలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖకు సంబంధించిన ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ తరఫున నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గురువారం ఆయన నివాసంలో సన్మానించారు. నాయకులు పుదరి గంగాధర్, ఎడ్ల నాగరాజు, వేణుగోపాల్‌రావు, అంజయ్య, మోహినొద్దీన్, కార్తీక్, చంద్రశేఖర్, అబ్దుల్, సబీ, శివలింగం, మనోహర్ పాల్గొన్నారు.



మహిళా సాధికారతకు కృషి



వికసిత్ భారత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందని వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేంద్ర కమిటీ సభ్యుడు, డిప్యూటీ సెక్రెటరి కమల్ అరోరా అన్నారు. గురువారం మండలంలోని పాల్దాలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. కేంద్ర పథకాల గురించి తెలియని వారికి అవగాహన కల్పించడానికి ఒక పండుగలాగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీఎం జీవన్ బీమా పథకం, సర్వే కార్యక్రమాల్లో ఆధునిక టెక్నాలజీ, ఐటీ పరంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జన్‌ధన్ యోజన తదితర కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకాల అమలు తీరు బాగుందని అధికారులను వికసిత్ భారత్ సంకల్పయాత్ర పర్యవేక్షణ బృందం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుప్రియ, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మనాయక్, డీఎంహెచ్‌వో సుదర్శనం, ఎల్‌డీఎం నాగ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డాక్టర్ వెంకటేశం, ఎంపీడీవో మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

బాల్కొండ: యాసంగిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని భీమ్‌గల్ వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లయ్య అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు అందించాలన్నారు. ఎరువుల నిల్వ నివేదికను రోజువారీగా అందించాలన్నారు. ఎరువులు అందుబాటులో ఉంచకపోవడంతోపాటు ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. ఆయనవెంట వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

విద్యార్థులకు అభినందన



సిరికొండ: స్కౌట్స్ గైడ్స్‌లో ప్రతిభ కనబర్చి ప్రతిష్టాత్మకమైన రాజ్యపురస్కార్ (గవర్నర్) అవార్డు పొందిన సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను వారు గురువారం కలిశారు. స్కౌట్స్ విద్యార్థులు యశ్వంత్, నీరజ్ రాథోడ్‌కు గవర్నర్ ద్వారా వచ్చిన ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు. విద్యార్థి దశలో స్కౌట్స్ గైడ్స్, ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ అలవడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం



డిచ్‌పల్లి: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఆశయాల సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ అన్నారు. గురువారం డిచ్‌పల్లిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుందర్ సింగ్, బబ్లు, శివ, రాజేశ్వర్, సాకేత్, అనిల్, నిఖిల్, రంజిత్, శ్రీరామ్, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్ కమిటీ ఎన్నిక

మాక్లూర్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణ కోసం ముందస్తుగా యాంటీ డ్రగ్ కమిటీని నియమించినట్లు మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా గంగారాం, ఉపాధ్యక్షుడిగా ఎ గంగాధర్, సభ్యులుగా జాఫర్, శివకుమార్, నాగమణి, రవీందర్‌రావు, రాణా సంగ్రామ సింహుడు, ఎస్సై సుధీర్‌రావు, ఎస్ పోతన్న, నితీశ్, జగదీశ్ ఉన్నారన్నారు.

ఉన్నతి కార్యక్రమం పరిశీలన

మోర్తాడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాథం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతి కార్యక్రమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి అనే అంశంపై ఉపాధ్యాయులకు ఆయన సలహాలు, సూచనలు అందజేశారు.

స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్

కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఎఫ్ఎల్ నిర్వహణ పద్ధతులను, లైబ్రరీ నిర్వహణ, గణితం, ఆంగ్లం సబ్జెక్టులకు సంబంధించి బోధన పద్ధతులను వివరించారు. గంగాధర్, ఎంఈవో ఆంధ్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఆర్మూర్‌టౌన్: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం సాధించే విధంగా అధ్యాపకులు కృషిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ అన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ బాలికల కళాశాలను గురువారం డీఐఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థినులు పరీక్షలకు బాగా సిద్ధమయ్యేలా చూడాలన్నారు. స్టడీ అవర్స్ ఏ విధంగా నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ప్రిన్సిపాల్ అక్బర్‌బేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

22న దీపాలు వెలిగించాలి

నిజామాబాద్ సిటీ: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న నగరంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పూజ కార్యక్రమం జరుపుకోవాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయోధ్యలో పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోషన్‌లాల్ బోరా, పవన్ ముందడ, బంటు ప్రవీణ్, సురేష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


అక్షింతలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉద్యోగ విరమణ సన్మానం



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గురుకుల కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసిన గంగవరపు ఆంజనేయశర్మ డిసెంబర్ 31న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందినట్లు ప్రిన్సిపాల్ బి సంగీత తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంజనేయ శర్మ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి అలివేలు, మాజీ ఆర్‌సీవో సింధు, వివిధ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ సత్యనారాయణ, మాధవీలత, శివరాం, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు, పెద్ద వాల్గోట్, చిన్నవాల్గోట్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలను గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి, తహసీల్దార్ రవీందర్‌రావు, కుందేళ్ల శ్రీనివాస్, సంతోష్, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	25	50	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	60	90	దోసకాయ	25	50
దొండకాయ	45	60	ఆలుగడ్డ	18	30
బీర్నిసుకాయ	30	70	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	80	గోబిపువ్వు	45	65
వంకాయ	60	90	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,500	వెండి (కిలో)	76,100
22 క్యారెట్స్	58,552		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	210	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	డెవిల్(తెలుగు) 10.45, 4.35
	హాయ్ నాన్న(తెలుగు) 1.35
	సలార్(తెలుగు) 7.20, 10.40
స్క్రీన్-3	సలార్(తెలుగు) 1.25, 4.35
	డెవిల్(తెలుగు) 7.45, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సలార్(తెలుగు)11.00,2.35,6.10, 9.45
స్క్రీన్-2	సలార్(హిందీ) 11.05, 6.40, 10.15
	యానిమల్(హిందీ) 2.40
స్క్రీన్-3	డంకీ(హిందీ) 12.40, 7.15
	హాయ్ నాన్న(తెలుగు) 4.00, 10.35
స్క్రీన్-4	డెవిల్(తెలుగు) 12.50, 10.10
దేవి	డెవిల్(తెలుగు)
నటరాజ్	సలార్(హిందీ)
లలితామహల్	హాయ్ నాన్న(తెలుగు)
విజయ్	సలార్(తెలుగు)